# బోర్

గోవిందరాజు సీతాదేవి

బ్రతుకు తెరువు కోసం వో చిన్న వుద్యోగంలో చేరటానికి భాగ్యనగరంలో అడుగు పెట్టింది వైదేహి. యెంతో కష్టంమీద వో కంపెనీలో టైపిస్టు వుద్యోగంతోబాటు మూడంతస్తుల మేడలోని పై భాగంలో చిన్నగది కూడా అద్దెకి దొరికిన తర్వాత 'అమ్మయ్య' అనుకోగల్గింది. ఈ ప్రయత్నంలో సాయపడిన దూరపు బంధువుకి మరీ మరీ కృతజ్ఞత చెప్పి తన గదిలోకి వచ్చింది.

దాదాపు ఆ మేడలో కాపురాలున్న వాళ్ళందరూ వుద్యోగాల కోసం బైటకి వెళ్ళిపోయే వాళ్ళేలా కన్పించారు. కొన్ని కాపురాల వాళ్ళు యిళ్ళలోవున్నా భర్తలని ఆఫీసులకి పంపి తలుపులు బిగించి నిద్రపోవటమో లేక యిల్లు తాళం పెట్టి పేరంటాలకో లేక సినీమాలకో వెళ్ళిపోవటంగా కన్పించింది. ఉదయం తొమ్మిది వరకూ సందడిగా వుండే ఆ మేడ పది అవుతూనే నిశ్శబ్దం అయిపోయేది. మళ్ళీ ఆరుగంటల కల్లా ఆ మేడలో రణగొణధ్వని మొదలయేది.

"యిన్ని కాపురాలున్నా తగూలు లేనట్లుంది" అనుకున్న వైదేహికి కొన్నాళ్ల తర్వాత గానీ తెలియలేదు. అసలు వీళ్ళకి పాపం టైము యెక్కడిదీ అని. ఆ మేడ యజమానురాలు చాలా మంచిదనే చెప్పాలి. ఒకటోతేదీ అవగానే వచ్చి అద్దె వసూలు చేసుకుని మళ్ళీ ఫష్టుకి గానీ కన్పించదు. అద్దెలకున్న వాళ్ళు డబ్బు యెక్కువే యిచ్చినా హాయిగా బ్రతుకుతున్నాం అని తృప్తిగా గాలి పీల్చుకుంటూన్నారు.

వైదేహికి యిదంతా బాగానే వుంది కానీ ఆఫీసు లేని సమయంలో టైము గడవటం చాలా కష్టంగా వుంది. తనంత తను పరిచయం చేసుకోవాలంటే యిష్టంలేదు. పోనీ క్రింది వాటాల్లో వాళ్ళయినా వాళ్ళంతగా వాళ్ళు పల్కరించేలా లేరు.

"ఏవూరు ఏంచేస్తూన్నారు" అని ఒక అటెండరు తల్లి అడిగి వూరుకుంది అంతే. యెవరికివారు యేదో మునిగిపోతూన్నట్లు వాళ్ళ వాళ్ళ టైముల ప్రకారం పరుగులు.

అబ్బ. యిక్కడివాళ్ళు బొత్తిగా యంత్రాల్లా వున్నారు అని విసుక్కుని ఈ నగరం అంతా యిలా లేదు. ఈ మేడలో వున్నవాళ్ళే అని మరీ విసుక్కుంది. ఆ మేడలోని పన్నెండు కాపురాల్లోని అందరినీ పరీక్షించి ఆఖరికి సాధ్వీమణితో పరిచయం చేసుకుంది. సాధ్వీమణి 'స్టెనో' ఆమె భర్త మరో కంపెనీలో 'స్టెనో'గా పనిచేస్తున్నాడు. ఆనందమూర్తి యెప్పుడు చూసినా హుషారుగా నవ్వుతూ నవ్విస్తూ కాలం గడిపేస్తూ వుంటాడు. భార్యని కంటికి రెప్పలా చూసుకుంటూన్నట్లే కన్పించింది వైదేహికి.

పెళ్ళి అయి రెండేళ్లు దాటినా పిల్లల కోసం ముచ్చటపడని ఆ యిద్దరినీ చూసి 'అబ్బ యిలా వుండాలి జీవితం అంటే' అనుకుంది వైదేహి. సాధ్వీమణికీ వైదేహికీ పరిచయం — క్రమక్రమంగా పెరిగిన తర్వాత ఒక రోజు.

"వెధవ వుద్యోగం. విసుగ్గా వుంది. యింటికి కావల్సిన కనీసవౌసరాలు సమకూర్చుకున్నాం. బ్యాంక్ బాలెన్స్ ఫర్లేదు. అయినా యింకా పిల్లలు అప్పుడేవద్దు అంటారు మావారు. నాకేమో బోర్‌లైఫ్ అన్పిస్తోంది" అంది దిగులుగా.

వైదేహి తెల్లబోయింది సాధ్వీమణి అలా అనేసరికి.

ఛీ. ఈవిడకి జీవితంలో సుఖపడటం చేత కాదు. అనుకూలుడైనభర్త యెంచక్కా ప్రతి పనిలోనూ సాయపడుతూ వంట పూర్తి చేసుకుని ఒకేసారి భోజనంచేసి స్కూటర్ మీద భార్యని కూర్చోబెట్టుకొని ఆమెని ఆఫీసు దగ్గర వదిలి తిరిగివస్తూ భార్యని తీసుకుని కావల్సిన సరుకులూ కూరలూ కొనుక్కుని యిల్లుచేర్చేభర్త లభించటం యెంతఅదృష్టం నిజం చెప్పాలంటే వైదేహి కంటే ఆనందమూర్తే అందంగా హుషారుగా కన్పిస్తాడు. యిన్నివున్నా సాధ్వీమణికి జీవితం 'బోర్' అన్పిస్తోందిఅంటే యింక తనలాంటి పెళ్ళికాని ఆడపిల్లలు వయస్సుమాట గుర్తుకి తెచ్చుకోటానికి ప్రయత్నించకుండా యంత్రంలామారి జీతండబ్బులు కూడా హాయిగా ఖర్చుచేసుకునే వీలులేక ప్రతినెలా తల్లిదండ్రులకి పంపుతూ 'పెళ్ళి'అనే వూహ కలగా మిగిలిపోతూవుంటే కూడా ధైర్యాన్ని కూడగట్టుకుని యింత దూరంగా ఈ వుద్యోగంకోసం వచ్చి వంటరిగా బ్రతుకుతూన్న తనకు జీవితం యెంత 'బోర్' అనిపించాలి. కాలం మారిపోతోంది. కనీస అవసరాల ఖరీదే పెరిగి సామాన్య గృహస్తు నలిగిపోతూన్న ఈ రోజుల్లో నాలాంటి వైదేహిలు వందలూ వేలూ కాదు లక్షల్లో వుండే వుంటారు. అనుకుని నిట్టూర్పు విడుస్తుంది వైదేహి. పాతిక సంవత్సరాలు వెనక్కి తిరిగి చూస్తే ఈనాటిలా ఆడపిల్లలని అవసరాల కోసం యింతగా వుద్యోగాల్లో చేర్చి పెళ్ళిళ్లమాట తలపెట్టేందుకే భయపడలేదేమో అనాటి తల్లిదండ్రులు.

యిలాంటి ఆలోచనలు వైదేహికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయని తెల్సినా వాటిని అరికట్టగల శక్తిలేదు. వంటరిగా తల్లిదండ్రులకి దూరంగా యిలా వుద్యోగం చెయ్యాల్సిందే. తప్పదు. ఆరుగురు ఆడపిల్లలు గల తన తండ్రి పెద్దపిల్లలిద్దరికి మాత్రమే పెళ్ళి చెయ్యగలిగాడు. ఇంక కట్నాలిచ్చి పెళ్ళి చేసేశక్తి లేక యస్సెల్సీ పూర్తి చేయించి టైపు పాస్‌కాగానే యెంతో ప్రయాసపడి ఈ వుద్యోగం వేయించుకున్నాడు కూతురికి. వైదేహికి తను అందగత్తెనని తెల్సు. సన్నగా పొడుగ్గా బంగారు తీగలా వున్నాననీ తెల్సు. ఈ అందం యే రాజకుమారుడు లాంటి వరుడినీ ఆకర్షించలేకపోయిందే అనే విచారం. యిరవైరెండేళ్ళ వైదేహికి ఆ వయస్సులోని అందరమ్మాయిల్లానే అందమైన కలలు కనటం కూడా అలవాటే.

మూడో అంతస్తులో రెండే గదులు. ఒకటి వైదేహిది. మరోటి తాళంవేసి వున్నదల్లా ఓ రోజు తెరిచి వుంది. పచ్చగళ్ల లుంగీ కట్టుకుని బనీను వేసుకుని భుజంమీద తువ్వాలు వేసుకుని యిటూ అటూ తిరుగుతూన్న అందమైన యువకుడు ఆ గదిలో కన్పించేసరికి వైదేహికి క్షణం గుండె ఆగి తిరిగి కొట్టుకోవటం మొదలెట్టింది.

"యితనెవరూ! కొత్తగా వచ్చాడా లేక పాతవాడేనా అనే లక్ష సందేహాలని తీర్చుకునేందుకు పరుగున సాధ్వీమణి దగ్గరకి వెళ్లింది.

ప్రారంభం!

తన ప్రశ్నలని వరసగా వదిలింది. అన్నీ విన్న సాధ్వీమణి తేలిగ్గా నవ్వేస్తూ,

"అబ్బ! యింతేనా! వేళగాని వేళలో వచ్చి తలుపుతట్టితే హడిలి చచ్చాను వైదేహీ" అంటూ గుండెని రాచుకుంటూ కుర్చీలో కూర్చుని ఆ కుర్చీలో నువ్వూ కూర్చో తల్లీ అని గ్లాసుడు నీళ్ళుతాగి "వైదేహీ అతనూ అతను పాండురంగమూర్తి అని ఓ చిన్న ఆఫీసరు. జీతం యెనిమిది వందలు రావచ్చు. వంటరిగానే వుంటాడు. వంటమాత్రం బాగా చేస్తాడు. యింతకిమించి వివరాలు కావాలంటే సాయంత్రం చెప్తాను. అవతల మావారి స్నానం పూర్తిఅయింది వస్తారు" అనేసింది. వైదేహికి వళ్ళు మండిపోయి గిరుక్కున వెనక్కితిరిగి రెండేసిమెట్లు యెక్కి తన గదిలోకి వస్తూ తల తిప్పి పాండురంగ మూర్తి గదిలోకి చూసింది. అతను బట్టలు వేసుకుని ఆఫీసుకు కాబోలు రెడీ అయి డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని తలదువ్వుకుంటూ వెనక్కి తిరిగి చూశాడు.

వైదేహి చటుక్కున తల తిప్పుకుని వెళ్ళిపోయింది.

## 2

వారం రోజులు గడిచిపోయాయి. వైదేహి ఆఫీసునించి ఆలశ్యంగా యింటికి వచ్చి మెట్లెక్కి పైకి వెళ్ళబోతూన్నదల్లా సాధ్వీమణి వాటాలోనించి బిగ్గరగా నవ్వులు వినిపించి అక్కడే ఆగిపోయింది.

యేదో విషయాన్ని గూర్చి ఆనందమూర్తీ సాధ్వీమణీ పాండురంగమూర్తీ చర్చిస్తున్నారు. పాండురంగమూర్తి గొంతు ఒకసారి నెమ్మదిగా మరోసారి గట్టిగా వినిపిస్తోంది. అతని మాటలకి సాధ్వీమణి విరగబడి నవ్వటం మరీమరీ వినిపిస్తూంటే వైదేహికి అకారణంగానే అసూయ కల్గుతోంది. ఆ ముగ్గురూ తరుచుగా అలా కల్సి కబుర్లు చెప్పుకోవటం వింటూనేవుంది. సాధ్వీమణి తనంత తనుగా పాండురంగ మూర్తిని పరిచయం చేస్తుందేమో అని చూసింది. పోనీ అతనైనా తనంత తానుగా పల్కరిస్తే యేం? అని కోపమూ వచ్చింది. అయినా వీళ్ళంతా యెంత పాత స్నేహితులైనా నన్ను యెందుకు కలుపుకోకూడదు! అని తనలో తనే వుడికిపోతూ మెట్లెక్కి పైకి వెళ్ళబోతూ కూడా ఆగి వెనక్కి తిరిగి సాధ్వీమణి వాటాలోకి రెండడుగులు వేసింది. అయితే అప్పటికే పాండురంగ మూర్తి వీధిలోకి వెళ్ళిపోవటంతో నిరాశపడి చకచకా మెట్లు యెక్కి పైకివచ్చి గది తలుపు తాళం తీసుకుని పక్కమీద వాలి తల నొక్కుకుంటూ "ఛీవెధవ జీవితం. అసలిది వెధవ్వూరు. యిక్కడి మనుషులు మరీ వెధవలు" అనుకున్నా వైదేహికి తల నొప్పి తగ్గలేదు.

"వైదేహీ" అంటూ తాపీగా వచ్చి కూర్చుని కబుర్లు మొదలెట్టింది సాధ్వీమణి.

"తల్లీ నీకు ఈ సాయం సమయంలో నే కావల్సివచ్చాను. ఏం నీ మొగుడు ఇంగ్లీషు సినిమాకి వెళ్ళాడా" అనుకుంటూ లోలోపల పళ్ళు కొరుక్కుంది సాధ్వీమణికి ఇంగ్లీషు సినిమాలంటే వళ్ళు మంట. చస్తే చూడదు.



భర్తనీ చూడనివ్వడు. అయితే ఆనందమూర్తి అప్పుడప్పుడూ భార్యకి మస్కాయిచ్చి ఇంగ్లీషు సినిమా చూసి వస్తూనే వుంటాడు. 'తిక్క కుదిరింది' అనుకుని లోలోపల సంతోషంగా వుంది వైదేహికి.

యిద్దరి కబుర్లూ సినిమాలూ సీరియల్సూ చుట్టి పాండురంగమూర్తి మీదకి తిరిగాయి. సాధ్వీమణి యింక పాండురంగమూర్తిని పొగడటం మొదలెట్టింది.

అయన చాలామంచివాడు వైదేహీ. మల్టీ పర్పస్ ప్రాజెక్టులా నానాగుణ సంపన్నుడు. అంటే దోబీ 'దర్జీ' బీబీ అన్నిటా ఆయన చెయ్యి అమోఘం. పైగా వంటలూ పిండి వంటలూ యెంత బాగా చేస్తాడనీ అబ్బ. చెప్పలేను. ఆయన చేతిలో అమృతమే వుంది. ఆదివారాలు మేమిద్దరం 'గెస్ట్'లుగా వెడుతూ వుంటాం. ఆయనకి అదేమిటో వంటలో కొత్తకొత్త ప్రయోగాలుచేసి స్నేహితులకి పెట్టటం హాబీ.

సాధ్వీమణి మాటలకి వైదేహి విరగబడి నవ్వింది. "యిదేం హాబీ బాబూ! బ్రహ్మ దేవుడు ఆడపిల్లని చెయబోయి అబ్బాయిని చేశాడేమో కానీ లేకుంటే ఈ రోజుల్లో ఆడ పిల్లలు వంటా వార్పూకి దూరంగా వుంటే ఈ మగమహారాజుకిదేం ఖర్మ."

'సాధ్వీమణికీ మాటలు నచ్చకున్నా "యెవరి హాబీలు వాళ్లవిలె" అనేసి లేచి వెళ్లి పోయింది. వైదేహికి మళ్లీ విసుగ్గా వుంది క్యారియర్ కుర్రాడు యింకా గంటగ్గానీ రాడు. విసుగ్గా వారపత్రిక తీసుకుంది. అదీ చదవబుద్ధి కాలేదు. కానీ ప్రక్కగదిలోనించి గుత్తివంకాయ కూర ఘుమఘుమలాడుతూ వాసన వేస్తోంది. ఆ వాసన వస్తూన్నకొద్దీ ఆకూరతో భోజనం చేస్తే యెంత బాగుండూ అన్పిస్తూవుంది. కానీ ఈ మూర్తితో అసలు పరిచయమే లేదే. ఆడపిల్లతనుగా యేం పల్కరించగలదు. తను పల్కరిస్తే యెంత బాగుండూ అని లోలోపల తహతహ ఎక్కువ అవుతూవుంది. వారపత్రిక గిరాటు కొట్టి లేచి బాల్కనీలోకివచ్చి యిటూ అటూ పచార్లు చేస్తూ క్యారియర్ కుర్రాడిని లక్షతిట్లేసింది. ఏడున్నర దాటిన తర్వాత కుర్రాడొచ్చి కారియర్ యిచ్చి వెళ్ళిపోయాడు. ఆకలి మండిపోతోంది కారియర్ విప్పి ప్లేటులో వడ్డించుకుంది. అన్నింటిరుచీ ఒకేలా వుండే ఆ పదార్థాలని చూస్తే యేడుపొచ్చింది. మార్కెట్టులో అతి చౌకగా వుంది కాబోలు గోరుచిక్కుడుకాయ కూర బూడిద గుమ్మడి కాయ కూటు చారూ చట్నీ అన్నీ ఒకేరుచిలా ఉన్నాయి. అవి నోట్లోకి పోనని మొరా యిస్తూంటే ఆకలికి ఆగలేక యెలాగో మింగుతోంది.

"ఛి ఛీ! ఈ భోజనం యింకా రెండు నెలలుతింటే హాయిగా స్వర్గం చేరుకోవచ్చు. అమ్మమ్మని రమ్మని రాసేస్తాను. అని లేచి వుత్తరం రాసేసి మర్చిపోకుండా మర్నాడు పోస్టు చేయాలని అనుకుని వచ్చి పక్కమీద వాలింది. అబ్బ ఈ ప్రక్కగదిలో యెవరన్నా గృహస్తు ఉన్నా హాయిగా వుండేది కాలక్షేపం.

## 'బ్రెడ్' బాసుంది

కావలసిన పదార్థాలు: పాలు—ఒకలీటరు, బ్రెడ్—ఒక పౌను, కండెన్స్‌డ్ మిల్క్—ఒక డబ్బా, నెయ్యి లేక డాల్డా — ఒక టేబిల్ స్పూన్, జీడిపప్పు, చారపప్పు — 25 గ్రాములు, ఏలకులు—6.

**తయారుచేయు విధానము:**

బ్రెడ్ స్లైసెస్‌లకు ప్రక్కలకుగల బ్రౌన్ కలర్ ముక్కలను తీసివేయాలి. కొన్నిపాలను తీసుకొని బ్రెడ్‌ని అర్ధగంట నానపెట్టాలి. మిగిలినపాలను మరగబెట్టి మరుగుతున్నప్పుడు అందులో గడ్డపాలు, నానినబ్రెడ్‌ను కలపాలి. ఈ మిశ్రమము చక్కగా క్రీమ్‌లాగ అయ్యే వరకు ఉంచాలి. నెయ్యిలో వేయించిన పలుకులు కలుపుకోవాలి. ఇది చాలారుచిగాఉండి, బ్రెడ్‌తో చేసిన బాసుందిలాగా ఉండదు, నిజంగా బాసుందీలాగే వుంటుంది!

—ఎమ్. వి. శోభారాణి.

అని విసుక్కుని అలా పనిఉన్నట్లుగా మెట్ల దగ్గరకి వెళ్లినట్లు వెడుతూ మూర్తి గదివైపుకి చూసింది. మూర్తి శుభ్రంగా గుత్తివంకాయకూరతో భోజనంచేసి ఆ కూర కొంత ఒక స్టీలుగిన్నెలో పెట్టి సాధ్వీమణికి కాబోలు తీసుకువెడుతూన్నాడు. వైదేహి చటుక్కున యివతలకి తప్పుకుంది మెట్ల దగ్గరనుంచి. మూర్తి వెళ్ళినవాడు అర్ధగంట అయినా పైకి తిరిగిరాలేదు.

వైదేహి లోలోపల వుడికిపోతూ తన గది లోకివచ్చి పడుకున్నదేకాని నిద్రపట్టలేదు.

## రాజీ

ఈ బ్రహ్మోవారి మహాశయుడికి ఆ సాధ్వీమణి తప్ప మరెవరూ మనుషుల్లా కన్పించరా నేనే పల్కరిస్తే. అవును. నేనే పల్కరిస్తాను. దృఢనిశ్చయంతో కళ్లు మూసుకుంది వైదేహి.

### 3

ఆదివారం మార్నింగ్‌షోకి పాత పిక్చర్‌కి వెళ్లి యెండలో యింటికి వచ్చి రిక్షావాడికి చిల్లర లేదనే నెపంతో గబగబా పైకివచ్చింది. కర్టెన్ గాలికి యిటూ అటూ వూగుతూ వుంది. లోపల మూర్తి యేంచేస్తున్నాడో తెలియదు చేత్తో తలుపు టిక్ టిక్‌న నెట్టింది రెండుసార్లు.

"యస్ కమిన్" అతని గొంతు యెంతో హాయిగా విన్పించింది.

'నమస్తే' ఒక్క అడుగు లోపలికి వేసింది వైదేహి. అతను అద్దం ముందు కూర్చుని తల దువ్వుకుంటున్న వాడల్లా వెనక్కి తిరిగి వైదేహిని చూడగానే ఆశ్చర్యపోయి చటుక్కున లేచి "ఓ! మీరా! నమస్తే ... రండి లోపలికి" ఏంపని అన్నట్లు ప్రశ్నిస్తూ న్నాయి అతని కళ్లు.

"ఫైవ్ రూపీస్ చేంజ్ కావాలి. రిక్షా వాడికి..."

"వున్నది యిస్తాను." అంటూ షర్టు జేబూలోనించి అయిదురూపాయి కాయితాలు లెక్క పెటి అందించాడు మూర్తి.

'థాంక్స్'అంటూ అయిదు కాయితం అందించింది.

"నో మెన్షన్" అంటూ చిరునవ్వునవ్వాడు. క్రిందకి వెళ్లి రిక్షా వాడిని పంపేసి గదిలోకి వెళ్లబోతూ కర్టెన్ ప్రక్కకి లాగి వున్నందు వల్ల అటుమూర్తి గదివైపు అప్రయత్నంగానే చూసింది.

ప్లేటులో వుప్మా కాబోలు పొగలు చిమ్ము తోంది. దానిలోని జీడిపప్పు పలుకులు చూస్తూంటే నోరు వూరేలా వుంది. ఆదగ్గరే ఫ్లాస్కు కప్పూ సాసరూ వగైరా. మూర్తి ఒక చెయ్యి మీద గడ్డం ఆన్చి ప్లేటు లోని వుప్మా చెంచాతో యిటూ అటూ కదు పుతూ అన్యమనస్కంగా వున్నట్లు కూర్చుని వున్నాడు. వైదేహి యింక వెళ్లి తనగది తాళం తెరిచి లోపలికివెళ్లి తలుపు దగ్గరగావేసుకుంది.

పిక్చరు అయి వస్తూ హోటల్లో టిఫెనూ టీ తీసుకుని వచ్చినా అప్పుడే ఆకలి అవుతూన్న ట్లుంది. ఆ వుప్మాచూసినందువల్లనోయేమో ఆకలి మరీ యెక్కువైంది. ఆకలిమీద నుంచి మనస్సుని మళ్లించటానికి గ్లాసుడు నీళ్లు తాగి బట్టలు మార్చుకునివచ్చి వాలు కుర్చీలో కూర్చుంది.

"మూర్తి యేమనుకుంటున్నాడో! సిగ్గులేని పిల్ల అనుకోడు గదా! అనుకోడు అనేనమ్మకం కల్గుతోంది బాగా. కానీ ఈ విషయం సాధ్వీ మణికిచెప్తాడా! చూస్తాను. సాధ్వీమణిసంగతి" అనుకుంటూవుంటే, వైదేహికి యేదో చెప్ప లేనంత తృప్తిగా వుంది. అయినా అతన్ని పల్కరించి మాట్లాడినంత మాత్రాన నా కొరిగిన లాభం యేమిటి? అనికూడా తనని తను ప్రశ్నించుకుంది. కానీ జవాబు లేదు. సాధ్వీమణి గనుక యితన్ని పరిచయంచేసి వుంటే ఈ విషయానికింత ప్రాధాన్యత వుండి వుండేది కాదేమో. అతనంత అతనుగా పల్క రించినా వేరొక విధంగా వుండి వుండేదని అన్పించింది. యేది యేమైనా వైదేహికిచాలా హుషారుగా వుంది. తనలో తనే కూనిరాగాలు తీస్తూవుంది. సాయంకాలం కనకాంబరాల మాల కొనుక్కుని నీలం పువ్వులున్న తెల్ల ప్రింటెడ్‌చీర కట్టుకుని అద్దంలో ముఖాన్ని అర్థగంట చూసుకుని ఆఖరుకి గదివాకిలివేసి యివతలికి వచ్చింది. మూర్తిగదికి పెద్దతాళం కన్పించి నీరసపడి సాధ్వీమణి వాటాలోకి వెళ్ల బోతుంటే అప్పుడే భార్యా భర్తలిద్దరూ స్కూటర్ యెక్కి యెటో వెళ్లిపోతూ వైదేహిని చూసి నవ్వుతూ చెయ్యివూపి భర్త నడుం చుట్టూ చెయ్యివేసిఅతని వీపుమీద వాలిపోయిన ట్లుగా కూర్చున్న సాధ్వీమణిని చూస్తూంటే యెందుకో అర్థంలేని కోపం ముంచుకొచ్చింది. గిర్రున వెనక్కితిరిగి గదిలోకి వచ్చేసి వీధివైపు కిటికీదగ్గరకి కుర్చీ లాక్కుని కూర్చుంది. అప్రయత్నంగా కళ్లలో నీళ్లు తిరిగాయి. దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. అలా రోడ్డువైపే చూస్తూ కూర్చుంది. వుబికివచ్చే కన్నీళ్లని తుడుచుకోవాలని కూడా అన్పించలేదు.

రోడ్డుమీద ఓ కుంటి ముసలాడు యివతల నుంచి అవతలకి దాటటానికి అవస్థపడుతున్నాడు. యిటూ అటూ కార్లూ లారీలూ రిక్షాలూ ఆటోలూ విరామం లేకుండా వస్తూనే వున్నాయి. అతను ప్రాణ భయంవల్ల కాబోలు అలాగే నిలుచున్నాడు పదినిమషాలు. ముందుకి వెనక్కి కర్రకాలుతో నడుస్తూ. యింతలో పదేళ్లబాబు అతన్ని చెయ్యి ఆసరా యిచ్చి యిటూ అటూ చూసి గబగబా అవతలకి దాటించేశాడు. ఆ వృద్ధుడు యేదేదో ఆశీర్వదిస్తూంటే ఆ బాలుడి కళ్లు సంతోషంతో మెరుస్తూన్నట్లున్నాయి. వైదేహి ఆ కుర్రాడినే చూస్తోంది తదేకంగా.

"వైదేహిగారూ!" మూర్తి వాకిలిదగ్గర నిల్చుని మెల్లని స్వరాన పిల్చినట్లై వులిక్కి పడి వెనక్కి తిరిగింది.

అతను గోధుమకలర్ పాంట్, వైట్ టెరీ కాట్ షర్టూ వేసుకుని యెంతో అందంగా ఠీవిగా నిల్చున్నాడు. అలా రెండు నిమషాలు చూసిన తర్వాతగానీ తన కన్నీళ్ల చారికలని గబగబా తుడుచుకోలేక పోయింది. ముఖాన్ని పమిటతో తుడుచుకుంటూ "రండి సినిమాకి వెళ్లలేదూ" అంది కుర్చీ చూపిస్తూ.

"సినిమాకా! నే వెళ్లాలనుకోలేదే...అవి ...మీరు ... మీరు" అని తటపటాయిస్తూ "నేను సమయం కాని సమయంలో వచ్చానా! సారీ"అంటూ వెళ్లిపోబోతూంటే వారిస్తూ.

"అహా యేంలేదు. కూర్చోండి" అంది కంగారుగా. అతను ఆగిపోయి. "చూడండి. నేను వూరికి వెడుతున్నాను. నా రూము తాళంచెవి కాస్త వుంచండి. రెండురోజుల్లో వచ్చేస్తాను. వెంట తీసుకు వెళ్ళొచ్చు. కానీ అక్కడ మర్చిపోయివస్తే... యిబ్బంది. అసలు సాధ్వీమణిగారు వుంటే ఆవిడకే యిచ్చేవాడిని. కానీ...వాళ్లు బైటకి వెడతారని తెలియదు. నేనసలు యిలా వూరుకి వెడతానని వాళ్ళకీ తెలియదనుకోండి" అంటూ అతను అతి ముఖమాటపడి పోతున్నందుకు కాదుగానీ సాధ్వీమణి లేక పోవటంవల్ల నేను గుర్తుకొచ్చాననన్నమాట అని కోపాన్ని మింగుకుంటూ.


"లాక్ వుంచటానికి అభ్యంతరం లేదు. ఆవిడరాగానే మీరు వెళ్ళారని చెప్పమంటే అలాగే చెప్తాను. 'లాక్' కూడా యిమ్మన్నా యిస్తాను" అంది ఆవేశాన్ని అదుముకుంటూ

"అహ. మీకా శ్రమ అక్కరలేదు. మీ దగ్గర వుంచండి."

'అలాగే' అంటూ తీసుకుంది వైదేహి. మూర్తి వెళ్ళిపోయాడు. మరీ నీరస పడి పోయింది. అతను మాట్లాడినా లేకున్నా రూములో వుంటేనన్నా కొంత ధైర్యం. యిప్పుడింక రాత్రంతా నిద్రకూడా కరువన్న మాట.

అబ్బ. 'ఏం జీవితం' తలపట్టుకుని పక్కమీద వాలిపోయింది.

(ఇంకా ఉంది)



(గత సంచిక తరువాయి)

# రొటీన్

గోపరాజు సీతాదేవి

నాలుగు రోజులు గడిచిపోయాయి. అతను ఏ క్షణంలో వస్తాడో అని ఆఫీసుకి వెళ్ళేవరకూ చూడటం ఆ పైన ఆఫీసు నించి యెటూ వెళ్ళకుండా యింటికి చేరుకోవటం చేసింది. విసుగెత్తి మరికొన్నాళ్ళు శలవు పెట్టాడేమో అనుకుని బోర్ అనిపిస్తే ఆఫీసు వదలగానే సినిమాకి వెళ్ళి యింటికి వచ్చి మేడమెట్లు యెక్కబోతూంటే అటెండరు తల్లి.

"అయ్యో వైదేహమ్మగారూ మూర్తి బాబు ఆరింటినించీ గదిముందు కూచున్నారు. సాధ్వీమణమ్మగారైనాలేదు ఆఇల్లో తాళమే" అంటూ వార్త అందించింది. వైదేహి 'అయ్యో' అనుకుని గబగబా మెట్లెక్కి పైకి వచ్చింది. మూర్తి బెడ్డింగ్, సూట్ కేసూ గదిముందు పెట్టి యిటూ అటూ పచార్లు చేస్తూన్నాడు.

"సారీ అండీ! యెంతసేపైంది ... నేనూ..." తడబడిపోయి తాళం చెవితెచ్చి అందించింది. మూర్తి అది తీసుకుని గది తెరిచి లైటు వేసి "కాసిని మంచినీళ్ళు యిస్తారా" అనేసి నీళ్ళు తీసుకుని తలుపు వేసుకుని బట్టలు మార్చుకుని, రెండు గ్లాసులు నీళ్ళు తాగి అలాగే లైటు తీసేసి నిద్రపోయాడు.

వైదేహికి చాలా బాధగా వుంది. కానీ ఏంచెయ్యలేక వూరుకుంది. సాధ్వీమణికి తెలిస్తే భోజనానికి పిలుస్తుందేమో కానీ నే నింతరాత్రివెళ్ళి 'ఆయన వచ్చారు' అని చెప్పటం యెలా! అర్థంలేని ఆలోచనలతోనే నిద్రపోయింది. మరో రెండు రోజులు జరిగిపోయాయి. మూర్తి మెట్లు దిగుతూ ఒక సారీ యెక్కుతూన్నప్పుడు ఒకసారీ కన్పించినపుడు. 'హలో' అని పల్కరించాడు. అంతే. పరిచయం అంతకుమించి ముందుకు పోలేదు.

"ఏంమనిషి 'నన్ను ముట్టకు నా మాలకాకి అన్నట్లు' విసుక్కుంది. ఈ బ్రహ్మచారి కాక మరేవర్కింగ్ గర్ల్ ఈ గదిలో వున్నా యెంత బాగుండేది. యెంచక్కా సినిమాలకీ షికార్లకీ షాపింగులకీ హోటళ్ళకీ వొక్కటేంటి యెక్కడికైనా వెళ్ళవచ్చు. పోనీ వివాహితుడైనా భార్యతోనన్నా కాసేపు కబుర్లు చెప్పి కాలక్షేపం చేసేపని. ఛీఛీ నా అదృష్టం యిక్కడా యింతే" అనుకుంది యిప్పటికి వందసార్లన్నా.

అయితే ప్రక్క గదిలోని మూర్తి మాత్రం నిశ్చింతగా రకరకాల వంటలు చేస్తూ కొత్త రకాల మీద ప్రయోగాలు చేస్తూ హాయిగా స్నేహితులతో ఆదివారాలు ఎంజాయ్ చేస్తున్నాడు. ఆఫీసరు అయినా కూడా యింత వోర్పుగా యెలా చేయగలడో యెంత ఆలోచించినా అర్థం అయి చావ లేదు వైదేహికి.

ఆదివారం మరీ బోర్ కొడుతోంది వైదేహికి. సినిమాకి పోదామన్నా మంచివిలేవు. సాధ్వీమణితో కాలక్షేపం చేదామంటె 'వంట్లో బాగాలేదు' అంటూ తలుపు ఘడియ బిగించుకుని నిద్రపోతోంది. వాళ్ళ ప్రక్క వాటాలో వున్న కమల పుట్టింటికి వెళ్ళటంతో ఆ మేడలో వున్న మగాళ్ళందరూ అక్కడ, పేకాట వేసుకుని కూర్చున్నారు. ఆనందమూర్తి గోల మరీ పెద్దగా విన్పిస్తోంది. అగోల సాధ్వీమణి యెలా భరిస్తోందోగానీ తనైతేనా చింతబరికె తెచ్చి అందర్నీ చావబాది తరిమి కొట్టేయాలన్నంత కోపం వచ్చింది. ఈ సాధ్వీమణి వుద్యోగం వెలిగిస్తోందే కానీ ఒట్టి గంగి రెద్దు మొఖం అని లోలోపల పళ్ళు కొరుక్కుంది. వాళ్ళపేకాటమాత్రం జోరుగా సాగిపోతూనే వుంది. వైదేహికి వళ్ళంతా మంటలెత్తినట్లై 'అబ్బ! వెధవ ఆదివారం' అని ఇరవైయ్యో సారి తిట్టుకుని తన గదిలోకి వచ్చి ఏం తోచక పెట్టితెరిచి చీరలన్నీతీసి మళ్ళా సర్ది పెట్టింది. రేడియో పెట్టింది. ఓ చెత్తనాటకం మూడో సారి ప్రసారం అవుతూంటే 'భగవాన్' అని రేడియో నోరునొక్కి 'ఛీఛీ' అనుకుంటూ యిటూ అటూ పచార్లు చేస్తున్న వైదేహికి ప్రక్క గదిలోనించి సన్నగా పాడుతూన్న మూర్తి గొంతు విని అలాగేనిల్చి "అయితే ఈ బ్రహ్మచారి మహాశయుడు ఆ ఆటలో లేడా ? లేక అయిపోయి వచ్చేశాడా!" అనుకుని ఈ వాళ ఈయనతో కాలక్షేపం చెయ్యక తప్పదులా వుంది అనుకుని అద్దంలో ముఖం చూసుకుని కాస్త పౌడరు రాచుకుని బొట్టు పెట్టుకుని అతనిగది వాకిట్లోకి వెళ్ళినిల్చుంది తలుపుదగ్గరగా వేసివుంది. అతని ఈలపాట మాత్రం విన్పిస్తూనే వుంది. తలుపు 'టిక్ టిక్' శబ్దంచేసేసరికి లోపలి ఈలపాట ఆగిపోయింది. 'యస్‌కమిన్' మూర్తి గొంతు విన్పించింది మృదువుగా. వైదేహి ఒక్క అడుగులోపలకివేసింది. తలుపురెక్క బార్లా తెరిచి 'నమస్కారం' అంటూ. మూర్తి యింబ్రాయిడరీ కుడుతూన్న వైట్‌క్లాతు చటుక్కున టేబిల్‌మీద పెట్టి టవలుభుజాన వేసుకుని రండి' అన్నట్లు ప్రతినమస్కారం చెయ్యలేదు. "నమస్తే" అన్నాడు చిరునవ్వులో కుర్చీ చూపిస్తూ. అతనికళ్ళు మాత్రం 'ఏం కావాలి!' అన్నట్లు చూస్తూన్నాయి. వైదేహికి లోలోపల వళ్ళు మండిపోతోంది. అప్రశ్నార్థకమైనదృష్టికి. అయినా శాంతంతెచ్చుకుంటూ "మీరు వెళ్ళలేదూ పేకాటకి. లేక అయిపోయి వచ్చేశారా" గదిని పరీక్షిస్తూ అడిగింది. ఆగది కాస్త పెద్దదే. అంతా నీట్‌గా సర్ది వుంది. షర్టులూ పాంట్లూ హేంగర్లకి వేలాడుతూన్నాయి కొన్ని. ఒకమూల వంట సామాను సర్ది వుంది. గోడకి అతనిదే ఒకఫొటో మరిరెండు సీనరీలున్న కేలండర్లూ వున్నాయి.

పరీక్షించటం అయిన తర్వాత మళ్ళీ మూర్తివైపు తల తిప్పింది.

"నాకు పేకాటరాదు" అన్నాడు వైదేహి వైపే చూస్తూ.

"నిజంగా ?"

"నిజం"

మళ్ళీ యేం మాట్లాడాలో తెలియలేదు వైదేహికి. అతనూ ఏంమాట్లాడాలా అనే ఆలోచిస్తున్నట్లు కన్పిస్తున్నది.

"మంచి సినిమాలు కూడా యేంలేవు"

"ఔను"

"మీకు ఈ ఆదివారాలు బోర్‌గా అన్పించవూ" వైదేహి వేసిన ఈ ప్రశ్నకి మూర్తి చిరునవ్వు నవ్వుతూంటే మరీ మండింది. అయినా రెట్టించి అడిగింది.

"లేదు"

"ఎందుకని ?"

"ఎందుకు ? అంటే చెప్పడం కష్టమే. కానీ యెప్పుడూ యేదో ఒక పనిమీద మనసుని 'లగ్నం' చేస్తే బహుశా 'బోర్' అన్పించదేమో !"

"యెప్పుడూ యేదో ఒక పని మోయా వుంటుంది"

"... ..."

"ఆఫీసు వున్న రోజుల్లో ఫర్లేదు. కానీ ఆదివారాలు ఈ దిక్కుమాలిన భాగ్యనగరంలో మరీ డల్‌గా గడుస్తున్నాయి."

"స్నేహితులని సంపాదించుకోండి."

"నాకు చేతకాదు. లేకుంటే ఒకనెల బాగా మాట్లాడిన లత అనే టైపిస్టు సడెన్‌గా మాటలు బంద్ చేసింది. మాదో వెధవ ఆఫీసు. మరింకెవ్వరూ ఆడపిల్లలు లేరు. యింక యిల్లుదగ్గరంటారా సాధ్వీమణి గారు ఒక్కరేగా. ఆవిడకి ఆదివారాల్లో తల నొప్పో, నిద్రో సరిపోతుంది. కానీ నాకా తల నొప్పిరాదు, నిద్రారాదు."

మూర్తి వైదేహి మాటలు వింటూనే లేచి అల్మారా తెరిచి బిస్కెట్ పాకెట్ తీసి ప్లేటులో పెట్టి టీ తయారుచేసి రెండు కప్పుల్లో పోసి తీసుకోండి అంటూ యిచ్చాడు.

వైదేహి 'టీ' తాగి 'థాంక్స్'అంది కప్పు క్రిందపెట్టి.

"నో మెన్షన్"

"మీకిలా టీ, టిఫెన్లూ, వంట చేసు కోవడం 'బోర్' అన్పించదూ"

"లేదు. అలవాటైపోయింది"

"నాకు వంటపని అంటేనే బోర్"

మూర్తి జవాబు చెప్పకుండా నవ్వి వూరుకున్నాడు. ఇతనితో మాటలు పెంచడం కష్టమే అనుకుని మరోసారి గదిఅంతా కలయజూసి సగంకుడుతూ వదిలిన యంబ్రా యిడరీ క్లాతుని చేతిలోకితీసుకుని చూస్తూ

"అరె! మీకు ఈపనికూడా వచ్చునా!" అంది ఆశ్చర్యంగా చూస్తూ. మూర్తిముఖం యెరుపురంగుకు తిరిగింది.

"మీకు రాదా"

"ఉహూ! అని చెప్పటానికి సిగ్గుపడను. కానీ యేంటిదీ 'ఫర్ గెట్‌మి నాట్' అక్షరాలు అందంగా బాగా కుదిరాయి. చాలా బావుంది. కలర్ ... మాచింగ్ ..."

మూర్తి పేపరు ముఖానికి అడ్డం పెట్టు కున్నాడు యేదో చదువుతూన్నట్టుగా. యింతలో పధ్నాలుగేళ్ళకుర్రాళ్ళు యిద్దరు "నమస్కారంబాబుగారూ" అంటూ వచ్చారు.

"రామూ గోపీ! యిప్పుడొచ్చారేంటీ. ఏంకావాలి" అంటూ మూర్తి పల్క రించాడు వాళ్ళని

"జీతం కట్టేశాం బాబుగారూ, పుస్తకాలు కొన్ని మార్కెట్టులో దొరికాయి. ఈరెండూ దొరకలేదు ..." అంటూ ఓ చీటీ అందించారు.

"నేను చూసి తెస్తాను. నాలుగురోజుల తర్వాత రండి. బాగా చదువుతున్నారుగా" అంటూ లేచి బిస్కెట్లు చెరోనాలుగూ పెట్టి "అన్నట్లు ఆ బట్టలు కుట్టించుకున్నారా" అన్నాడు.

"టైలర్ యింకా యివ్వలేదు." అన్నారు యేక కంఠంతో.

"ఈసారి ఆ బట్టలు వేసుకుని వచ్చి చూపండి. ఈ పదిరూపాయలూ వుంచు కోండి" అని కాయితంయిస్తే అదిఅందుకొని నమస్కరించి వెళ్ళిపోయారు. తిరిగి గదిలో నిశ్శబ్దం ఆవరించింది. వైదేహి వాళ్ళని గురించి యేమైనా చెప్తాడేమో అని రెండు నిముషాలు చూసింది. కానీ మూర్తి చెప్పేలా లేడు. తనే అడిగింది కుతూహలం ఆపుకోలేక.

"ఆ అబ్బాయిలు యెవరు?" అని



"హైస్కూల్లో చదువుకునే స్టూడెంట్సు"

"నే అడిగింది వాళ్ళ వివరాలు. అంటే మీకు యేమన్నా ... ..."

"ఓ అదా! అలాంటిదేం లేదు. కానీ చాలా తెలివిగలవాళ్ళు. బాగా చదువుతారు. నాకుతెల్సింది అంతే"

వైదేహికి చాలా చికాకొచ్చింది. లేచి వెడతాను అంది. మూర్తి ఆమెవెంట ఒక అడుగు వేశాడు. మీకేమన్నా బుక్స్ కావాలా! అనటంతో ఎంతో సంతోషంగా "ఓ...కావాలి ఏం వున్నాయి మీ దగ్గర" అంది

"మీకెలాంటివి కావాలి"

"సినీ మాగ్జయిన్స్ అంటే యిష్టం"

"ఓహో! సారీ అలాంటివి లేవు"

"మరేం వున్నాయి"

"విశ్వనాథవీ, అడవి బాపిరాజువీ... శరత్‌వీ... చూడండి శరత్ ఈ నవల మీరు చదివారా" అంటూ అందించిన నవల పట్టుకుని తనగదిలోకివచ్చి విస్సిరి పారేసింది. మంచం మీదికి ఒరిగిపోయింది. అంతలోనే వాచీచూస్తే అర్ధగంట మూర్తిరూములో గడిచిందని గ్రహించి ఆశ్చర్యపోయి 'అరె! అర్ధగంట యేంమాట్లాడాం. తెలియకుండానే గడిచిపోయింది' అనుకుంది.

మళ్ళీ వైదేహికి టైము గడవటంలేదు. అబ్బబ్బ అనిలేచి బట్టలు మార్చుకుని చూసిన సినిమాయె అయినా మళ్ళీ వెళ్ళి 'క్యూ' లో యెర్రటి యెండలో అర్ధగంట

**రాజీ**

నిలబడి అమ్మయ్య అనుకుంటూ హాల్లోకివెళ్ళి కూర్చుంది. యింట్రవల్‌లో ప్రక్కకితిరిగి చూస్తే వెనకసీట్లో మూర్తి అప్పుడే వైదేహిని చూశాడు. 'హలో' అంటూ పల్కరించాడు. "సినిమాకి వెడతానని చెప్పనే లేదు" నిష్టూరంగా అనే వైదేహివైపు స్నేహపూర్వకంగా చూస్తూ

"ఈ అభియోగం నేనూ చేస్తున్నాను." జవాబుచెప్పండి అన్నట్లు చూశాడు.

'భలేవారు' అంటూ నవ్వింది. మూర్తి కోకోకోలా రెండు తెప్పించాడు. వైదేహి తాగేసి 'థాంక్స్ చెప్పను' అంది ఓరగా చూస్తూ 'నేను ఆశించలేదు' అన్నాడు కాస్త బెరుకుని వదిలి హాయిగా కబుర్లు చెప్పేస్తూ.

"మీరింత సరదాగా కబుర్లు చెప్తారని సాధ్వీమణి యెప్పుడూ చెప్పలేదే"

"మీరు అడిగారేంటి" కోకోకోలా కుర్రాడికి డబ్బులిస్తూ.

"మీతో మాట్లాడటం కష్టంలా వుందే"

"అహహ ... అలాఅని మానేయకండి" అంటూండగానే లైట్లుపోయి తిరిగి సినిమా ప్రారంభమైంది. వైదేహికి అతను లేచివచ్చి తన ప్రక్కన ఖాళీగా వున్న కుర్చీలో కూర్చుంటే బాగుండు అన్పించింది. కానీ మూర్తి రాలేదు. పిక్చర్‌ని తదేకంగా చూస్తున్నాడు. వైదేహికి మాత్రం పిక్చరు మీద మనస్సు నిలవడం లేదు.

"ఏంటీ యితని మనస్తత్వం అని ఆలోచిస్తోంది. పిక్చరు పూర్తిఅయి బైటకివచ్చి మూర్తి స్కూటర్‌దగ్గరకి వెళ్లబోతూ.

"రిక్షా చూసుకుంటారా! లేక ఆటో పిలవనా" అన్నాడు.

"ఏదీ అక్కరలేదు"

"మరి"

వైదేహి అలాగే నిల్చుంది. జనం వెళ్లిపోతున్నారు.

"బస్‌లోవస్తే చాలా టైము అవదూ!"

"అవుతుంది ... కానీ ... చీకటి పడితే నాకు భయం" మూర్తి ముఖంలోకి చూస్తూ అంది.

"అలాగా!..."అన్నాడు అంతే...

"మీరూ నాతో బస్‌లో రండి"

"నాకు స్కూటర్ వుందే..."

"పోనీ మీస్కూటర్‌మీద నేనొస్తాను" కోపం మింగుతూ అంది.

క్షణం తెల్లబోయినట్లయినా అది కన్పడనీయకుండా "అయితే వుండండి తీసుకువస్తాను" అంటూ స్టాండులోనించి తెచ్చి దగ్గరగా ఆపాడు. వైదేహి క్షణం తటపటాయించింది. 'మరేం ఫర్వాలేదు' అనుకుని యెక్కి కూర్చుంది. మూర్తి రోడ్డుమీదే దృష్టినిల్పి నడుపుతూ యేం మాట్లాడలేదు.

"ఛెత్ ఏంమనిషి" యింతోటి లిఫ్ట్ ఎవరిక్కావాలి...పళ్ళు కొరుక్కుంది.

ఎర్రలైటు వెలగటంతో రిక్షాలూ కార్లూ స్కూటర్లూ వరుసగా ఆగిపోయాయి. మూర్తి స్కూటరూ ఆగిపోయింది. పచ్చలైటు కోసం అందరూ చూస్తున్నారు. "నమస్కారం సార్" యికిలిస్తూ పల్కరిస్తున్నాడో నల్లటి నడివయస్కుడు 'నమస్కారం' మూర్తి పొడిగా అనేసి తల తిప్పి పచ్చలైటు కోసం చూస్తూంటే "ఫామిలీని యెప్పుడు తీసుకొచ్చారుసార్" అంటూండగానే మూర్తి స్కూటర్ స్పీడుగా ముందుకుపోనిచ్చాడు.

'ఇంకాస్సేపు ఆగితే నీ సొమ్మేంపోతుందనీ అప్పుడే వెలిగి చచ్చావు పచ్చలైటూ'అనుకుంది కోపంగా. 'పాపం ఆఫీసులో వాడులా వుంది' అని తృప్తిగా నవ్వుకుంటూ.

స్కూటర్‌దిగి లోపలికి వస్తూన్నవైదేహిని ఆ మేడలో కాపురాలున్న వాళ్లు యిద్దరు



ముగ్గురు ఓసారి చూసి మళ్ళీ తల తిప్పుకున్నారు. వైదేహికి యేదో పెద్ద ఘన కార్యం చేసినట్లు గర్వంగావుంది. మనస్సుకి తృప్తిగా కూడా వుంది.

మూర్తి మాత్రం అతి మామూలుగా తన గది తాళం తీసుకుని లోపలికి వెళ్ళిపోయాడు. వైదేహికారాత్రి అంతా సరిగ్గా నిద్రపట్టలేదు యేవేవో ఆలోచనలు అలా అలా సాగిపోయి మగత నిద్రలోకి జారిపోయింది. ఆ నిద్రలో యేదో గమత్తయిన కల.

మూర్తి తనని పెళ్ళి చేసుకుంటానని మాట యిచ్చినట్లూ యిద్దరూ యెంతో సంతోషంగా సినీమాలూ షికార్లూ తిరుగుతూ కాలం గడుపుతూండగా మూర్తి హఠాత్తుగా ఒక అందమైన అమ్మాయిని తీసుకువచ్చి "వైదేహీ నన్ను క్షమించు. ఈ అమ్మాయిని తప్ప మరెవర్నీ పెళ్ళి చేసుకోలేను" అని ఆ అమ్మాయి ముందరే చెపుతూంటే వైదేహికి వళ్లంతా మంటలు పెట్టినట్లై "మోసం. దగా...నువ్వు...నువ్వు దుర్మార్గుడివి, రాక్షసుడివి నమ్మించి...మోసం చేస్తావా" అంటూ పెద్దగా అరవాలని ప్రయత్నించింది కానీ నోరు పెగల్లేదు. వళ్లంతా చెమటలు పట్టి మెలుకువ వచ్చేసింది. రెండు నిమిషాలు ఆలోచించిన తర్వాతగానీ యిది కల అని అర్థం కాలేదు. అప్పుడింక "అమ్మయ్య కలేకదూ!" అనుకుని లైటువేసి గ్లాసుడు మంచినీళ్లుతాగి "మూర్తి హాయిగా నిద్రపోతూ వుంటాడా!" ఆలోచనవచ్చి గడియారం వైపుచూసింది పదిన్నర అయింది అంతే. ఈ బ్రహ్మచారి మహాశయుడికి అప్పుడే నిద్ర యెక్కడ పడుతుంది. అనుకుంటూ తలుపు తీసుకుని అడుగులో అడుగువేస్తూ మూర్తి గది కిటికీ దగ్గరనిల్చి తొంగిచూసింది.

తలదగ్గరున్న లైటు వెల్తురులో రెండు దిళ్లు యెత్తు పెట్టుకుని ఒకదిండు గుండె మీద పెట్టుకుని గట్టిగా బిగించి పట్టుకుని పుస్తకం చదువుకుంటూ వచ్చే ఆవులింతని ఆపుకోటానికి వ్యర్థప్రయత్నం చేస్తూన్న అతన్ని యింకాస్సేపు అలాగేచూస్తూ నిల్చోవాలన్పించింది వైదేహికి. కానీ యేదో భయం అన్పిస్తోంది. పోనీ తలుపుతట్టి "నాకు నిద్ర రావటంలేదు కబుర్లు చెప్పండి" అని అడిగితే '...అమ్మయ్యో రాత్రి సమయంలోనా! వద్దు' అనుకుంటూండగానే మూర్తి చదివే పుస్తకం ప్రక్కనపెట్టి కుడిచెయ్యి చాచి లైటు స్విచ్ ఆఫ్ చేసి కళ్ళు మూసుకున్నాడు, వత్తిగిల పడుకుని.

"ఛీఛీ..." అనుకుంటూ తన గదిలోకి వచ్చి తలుపు ఘడియ గట్టిగా బిగించుకుని లైటు తీసి మంచం మధ్యగా చేతులు పెట్టుకొని చాలాసేపు అలాగే కూర్చుండిపోయింది.

"ఛీఛీ ... ఒక్క సినిమాలో జరిగినట్లు యే చిన్న విషయం నిజ జీవితంలో జరిగి చావదు. పైగా ఆ సినీమాలు చూసినందువల్ల మనస్సు వుద్విగ్నమవటం తప్పించి ... వెధవ సినీమాలు. ఛెత్ చస్తే చూడకూడదు. కట్నం యివ్వకుండా యే వెధవా ఆడపిల్లని పెళ్ళాడడు. ఫారెన్ కారులో వెళ్లే యే భాగ్యవంతుడూ రంగు వెలిసిన చీర కట్టుకుని బస్‌స్టాపులో నిల్చుంటే దయతల్చి 'లిఫ్ట్' యివ్వడు. పోనీ రిజిష్టర్ మారేజీ చేసుకొనేందుకైనా ఒక్క మగవాడు ముందుకు రాడు. సమాజం యింకా డబ్బుమీదే నడుస్తూంటే నాలాంటి ఆడపిల్లలు యిలా కన్యలుగా వుండిపోవల్సిందేనా. యిలా యెన్నాళ్లు మనస్సుని కోరికలనీ ఆశలన్నీ బిగపట్టుకుని కాలం దొర్లించటం. నేను ఒక్కదాన్నేనా! నాలాంటి కన్యలు వేలూ లక్షలూ యెందరో ఈ దిక్కుమాలిన భారతదేశంలో" అనుకుంటూవుంటే వైదేహి కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగాయి. అంతలోనే మనస్సుకి తనకితనే యిలా నచ్చచెప్పుకుంది.

"నాన్నకే డబ్బుంటే నన్నిలా వంటరిగా యింతదూరం పంపేవారా! నామీదవిశ్వాసం వుంచి నా సుఖాన్నే కాంక్షించి నా కర్తవ్యాన్ని హెచ్చరించి మరీ మరీ చెప్పి పంపారు. నా మంచి చెడులు నావే అనేది పరోక్షంగా అర్థం అయేలా చెప్పారు. నిజమే. ఒక వయస్సు వచ్చింతర్వాత యెవరి జీవితం వారిదే దాన్ని పూలబాటల్లో నడుపుకోవటం కానీ అడ్డదారుల్లోకి తిప్పుకోవటం కానీ వాళ్ల చేతుల్లో వుంది కనుకనే చాలా నిగ్రహంతో వ్యవహరించాలి. ఔను. ఆడపిల్లనే అయినా నా జీవితం నా కలల కనుగుణంగా తీర్చిదిద్దుకోవాలి."

దూరంగా యేదో శబ్దమైంది. వైదేహి ఆలోచనలు ఆగిపోయాయి వైదేహి లేచి కిటికీ లోనించి రోడ్డుమీదకి చూస్తూ నిల్చుంది. అప్పటికి టైము యెంత అయిందో కానీ బీటు కానిస్టేబులు బూట్లు టకటకా శబ్దంచేస్తూ తిరుగుతూన్నాడు. అలా రోడ్డుమీదకిచూస్తూ తిరిగి ఆలోచనల్లోకి జారిపోయింది.

"యిదేంటి! నాకు తెలియకుండానే నా ఆలోచనలిలా కొత్తదార్లని పడుతూన్నాయి. మనస్సూ యేదో సరికొత్త లోకాలని వూహిస్తోంది యెలా జరుగుతోంది... అలా అయిదు నిమిషాలు నిల్చుని విసుగ్గా తిరిగి పడుకోబోతూ టేబుల్‌పైకి అప్రయత్నంగా చూసింది. దానిమీద కొన్ని పుస్తకాలు మూర్తి యిచ్చినవి పడివున్నాయి. అతను పుస్తకాలు యిస్తూ.

"చూడండి వైదేహిగారూ, మనిషికి మంచి స్నేహితులు పుస్తకాలు. వీటి ఆసరాతో మనం... మనల్ని సంస్కరించుకోవటమే కాదు ప్రేమించటం ప్రేమించబడటం. యింకా చాలాచాలా చెయ్యవచ్చు. నిజం చెప్పాలంటే ఒకరచయిత ప్రభావం అతని పుస్తకం చదివే పాఠకుడి మీద చాలా వుంటుందండీ. మనం మన అభిరుచులకి అనుగుణంగా పుస్తకాలని యెన్నుకుని చదవటం అలవాటు చేసుకోవాలంటాను. మీరేమంటారు" అన్నప్పుడు తను జవాబు చెప్పలేకపోయింది. మెల్లగాలేచి తన గదిలోకి వచ్చేసింది.

వూ అనుకుంటూ ఆలోచనలు ప్రక్కకి నెట్టి కళ్లు గట్టిగా మూసుకుని నిద్రపోవటానికి ప్రయత్నిస్తోంది వైదేహి.

(ఇంకా ఉంది)

**స్థూలకాయులకో చిట్కా**

వలంగా వున్నవాళ్లు అంటే లావుగా వున్నవాళ్లు తమ స్థూలకాయం తగ్గటానికి వైద్యులను హింసపెట్టకుండా వారానికోరోజు ఉపవాసం చేయటం మంచిది అని యిటీవల ఒక ఆరోగ్య శాస్త్ర నిపుణుడు ప్రకటించారు. స్థూలకాయులకు వచ్చే వ్యాధుల పై చర్చించే నిమిత్తం యీ మధ్య పశ్చిమ జర్మనీలో జరిగిన ఆరోగ్య మహాసభలో పై 'కిటుకును' వెల్లడిస్తూ ప్రొఫెసర్ హాన్స్ డి చూనీట్ గారు ఉపవాసం రోజున స్థూలకాయులు మూడు లీటర్లు నీళ్ళ మాత్రం త్రాగాలి అని కూడా చెప్పారుట!

# రాజీ

గోవిందరాజు సీతాదేవి

*(గత సంచిక తరువాయి)*

వైదేహీ మూర్తి అరమరికలు లేకుండా కబుర్లు చెప్పకుంటూ ఆఫీసులు లేని సమయాల్లో సినీమాలకీ షికార్లకీ తిరుగుతున్నారు. వైదేహికీమధ్య రుచికరమైన పదార్థాలతో భోజనం కూడా దొరుకుతోంది. పాండురంగమూర్తి యే కొత్త ప్రయోగం చేసినా దానిరుచి చూసే బాధ్యత వైదేహి మీద పడింది. రోజులు క్షణాల్లా గడుస్తున్నాయి. సాధ్వీమణి ఈమధ్య అస్సలు మాటలు తగ్గించేసి సూటీపోటీగా యేదేదో అనేస్తోంది. వైదేహికి వళ్లు మండి "యింతకీ మీరనేదేంటి" అంటూ నిలదీసింది ఒకనాడు.

"అబ్బే యేంలేదు. మూర్తిగారుండగా మీకింక కాలక్షేపానికేం కొదవ అన్నాను అంతే." అంటూ వ్యంగ్యంగా నవ్వింది.

"మీరూ రాకూడదూ! కాలక్షేపం అవాలంటే" వురిమిచూస్తూ అంది వైదేహి.

"నేనేం మారని రూపాయిని కాదు నీలా! నాకు యిల్లు వుంది. యిల్లాలిని నేను"

"ఏంటీ! నేను...మారని రూపాయినా! మళ్లీ అను చెంపలు వాయించేస్తాను" మీద మీదకెళ్లింది వైదేహి.

"నే అనలేదు లోకం అంటోంది. ఆ మాటే నే అంటున్నాను. ఈ చుట్టూ సమాజం అంటోంది తెల్సునా. నీలాంటి ఆడపిల్లలు మూలంగానే ఈనాడు మగాడు మంచివాడుగా వుండలేకపోతున్నాడు..."

మరీ రెచ్చిపోతూంది సాధ్వీమణి. వైదేహి నిప్పులు కక్కుతూ సాధ్వీమణి మీదకి వెడుతూంటే అప్పటికి రెండు నిమషాల ముందు ఆఫీసు నించి వచ్చి తన గదిలోకి పోబోతూ పిల్లద్దరి కేకలకీ మెట్లమీదే ఆగిపోయిన పాండురంగమూర్తి వైదేహి అలా సాధ్వీమణి మీదకి వెళ్లటం చూసి చప్పున వచ్చి వైదేహిని గట్టిగా పట్టుకుని ఆపుతూ.


"వైదేహిగారూ! యేమిటిదంతా!" అంటూ బరబరా పైకి లాక్కువెళ్లా

వైదేహికి ఆవేశం తగ్గింది కాస్త. మూర్తి పిడికిట్లో యింకా కుడిచెయ్యి నలిగిపోతూనే వుంది. రెండు క్షణాలు ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు. మూర్తి పిడికిలి మెల్లగా వదులైపోయింది.

"సారీ వైదేహిగారూ" అంటూ మూర్తి గభాలున గది తాళం తీసుకుని లోపలికి వెళ్లి తలుపు ఘడియ బిగించేసుకున్నాడు.

"సారీ.నే చెప్పాలి మూర్తిగారూ! ఒక్క క్షణంతలుపుతెరవండి.జరిగిందిచెప్తాను.ప్లీజ్"

"ప్లీజ్ వైదేహి! కాస్సేపు నన్ను వంటరిగా వదిలెయ్యండి" మూర్తి గొంతు అతి దీనంగా మెల్లిగా విన్పించింది. వైదేహి ఏం చెయ్యలేక తన గదిలోకి వచ్చి మంచం మీద పడిపోయింది.



విధవ సమాజం. బాధపడుతూంటే సానుభూతి చూపదు కానీ సుఖంగా వుంటే ఈర్ష్య చూపుతుంది. ఈ సాధ్వీమణిలో యింత ఈర్ష్యాసూయలు దాగివున్నాయా, తనతో మాట్లాడితే ఫర్లేదు కానీ నాతో మాట్లాడితే యింత అసూయపడిపోయిందెందుకు. యెవరెన్ని విధాల అన్నా నేను భయపడనూ పడనూ పడనూ.

ఆ రాత్రి వైదేహి భోజనం చెయ్యలేదు. ప్రక్కగదిలోని మూర్తి భోజనంచేసిన అలికిడి విన్పించలేదు. కానీ రాత్రి పన్నెండు గంటల వరకూ లైటుమాత్రం వెలుగుతూనే వుంది.

* * *

రెండు రోజులు అతినెమ్మదిగా గడిచాయి. వైదేహి లోపల లోపల వుడికిపోతోంది. మూర్తి పల్కరిస్తే మాట్లాడాలని యెదురు చూస్తోంది కానీ మూర్తి యేం ఆలోచిస్తున్నాడో తెలియదు. సాధ్వీమణి ఆఫీసుకి వెళ్ళకుండా యింట్లోనే వుండిపోయిందియెందుకో. వైదేహికి పల్కరించ బుద్ధికాలేదు. ఆఫీసులో పని సరిగా చెయ్యక ఆఫీసరుచేత చివాట్లుతిని యేడుపు మొఖంతో యింటికి వచ్చేసినవైదేహి మూర్తిగది తలుపు తెరిచివుండటంచూసి ఈ బ్రహ్మచారి మహాశయుడు అప్పుడే ఇల్లు చేరాడేం. అని క్షణం తటపటాయించి ఏమైనా సరే అని మూర్తిగదిలోకి అడుగుపెట్టింది. మంచంమీద కళ్ళుమూసుకు పడుకున్నమూర్తి చెప్పల చప్పుడికి కళ్ళు తెరిచి చూసి లేచి కూర్చుంటూ.

"రండి" అన్నాడు.

వైదేహి కుర్చీ లాక్కుని కూర్చుని మూర్తి ముఖంలోకి చూసింది క్షణం. యెప్పుడూ నవ్వుతూ వుండే ముఖం చిన్నబోయివుంది. కళ్లు పీక్కుపోయి వున్నాయి. జ్వరం పడినవాడిలా వున్నాడు.

"వంట్లో బాగాలేదా!"

"బానే వుంది" అన్నాడు మాసిన గడ్డాన్ని చేతో రాచుకుంటూ.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా జరిగాయి. యేన్నో చెప్పాలని వైదేహి వచ్చిందేకాని తీరా అతన్నిచూసి అన్నీ మింగేసుకుంది. మూర్తి పరిస్థితీ అలాగే వుంది.

"సారీ మూర్తిగారూ! నేనా రోజు..."

"వైదేహీ! సారీ చెప్పవల్సింది నేను. నా వల్ల అకారణంగా వాదు మీ మీద పడుతోంది. సాధ్వీమణి అలా అన్నందుకు నేను క్షమాపణ అడుగుతూన్నాను. మీరారోజు ఆ మాటలకి గాయపడ్డారని తెల్సు. అయితె యేం చెప్పి మీ బాధని పోగొట్టగలనో అర్ధంకావటం లేదు. వంటరిగా వున్న ఆడపిల్ల అందులో అవివాహిత అయిన మీరు నాతో కాస్త చనువుగా తిరగటం అనుమానానికి కారణం అవుతుంది నిజమే. నలుగురు నాలుగు రకాలుగా అనుకుంటారు అదీ నిజమే. నేనే చాలా పొరపాటు చేశాను."

"అంటే" వైదేహి ముఖం ఎర్రగా చేసుకు అడిగింది. ఏంలేదు మీరు 'స్త్రీ' కాకుండా పురుషుడైవుంటే మనం యిద్దరం యెంత స్నేహితంగా వున్నా యెవ్వరూ యేం అనటానికి అవకాశం లేదుగా. చూడండి. అందం అయిశ్వర్యం, పదవి, హోదా యిలాంటివన్నీ ఈరోజు వుండచ్చు రేపు పోవచ్చు. కానీ పవిత్రమైన స్నేహితం వుంది చూశారూ అది ... అది జీవితాంతం మధుర స్మృతిగా మనస్సులో మిగిలిపోతుంది. యిందుకే నాకు స్నేహితం అంటే వెర్రి అభిమానం. నాకు స్నేహం చెయ్యటం రాదు. అందులో మీలాటి అమ్మాయిలతో అసలే మాట్లాడటం రాదు. మీరే చొరవగా నాదగ్గరికి వచ్చినందుకు యెంతగానో సంతోషిస్తున్నాను. అయితే... ఈ అపశృతులు వింటే..."

"యెవ్వరూ అనలేదు. సాధ్వీమణి అమాయతో అన్న మాటలు అవి"

"వైదేహీసాధ్వీమణి స్వతహా చాలామంచిది. నెమ్మదస్తురాలుకూడా. నేనంటేచాలా అభిమానంకూడా. నాకు బాగా తెల్సు. కానీ ఆరోజు అలా యెందుకు మాట్లాడిందో తెలియదు. అమె ఈమధ్య యేదో మానసికంగా బాధపడుతున్నట్లు గమనించాను. కానీ కారణం తెలియదు. అడిగినా చెప్పలేదు. బహుశా భార్యాభర్తల మధ్య యేదైనా చికాకులేమో అనుకున్నాను. ఈ అశాంతిలోనే మిమ్మల్ని ఏదో అనేసింది అంతే వైదేహిగారూ."

యివన్నీ చెప్పి కాస్త తేలిక పడినట్లుగా చూశాడు మూర్తి.

వైదేహి విస్సురుగా తలతిప్పి "ఏది ఏమైనా సాధ్వీమణి అదృష్టవంతురాలు. మిమ్మల్ని శంకించినా మీరు మాత్రం చాటున కూడా ఆవిడమీద ఈగవాలనివ్వనంటూన్నారు. మీమనస్సు అతి విశాలం కావచ్చు. కానీ నేనిలాంటివి సహించలేను మూర్తిగారూ. పెళ్ళి ఆలస్యమైనంతమాత్రాన నా ప్రవర్తనని శంకించటానికి ఈవిడ యెవరు? నేనేకాదు. ఆత్మాభిమానం వున్న యే ఆడపిల్లఅయినా ఆవిడని వదలదు. ఆరోజు మీరు సమయానికి రాకుంటే చెంపలు వాయించేదాన్ని తెల్సునా!"

"వైదేహిగారూ... క్షమించమని అడిగినా ఆవేశపడుతూన్నారా!"

"మీరు ఆ మాటలు పట్టించుకోకుండా మళ్ళీ మామూలుగా వుంటేనే నేనా విషయం వదిలేసేది. నేను సాధ్వీమణికే-కాదు నా తల్లిదండ్రులకైనా భయపడను. నాకు మంచిది అని తోస్తే చేసెయ్యటమే నా పని, పర్యవసానం యెలా వున్నానరే"

"యేపనైనా ఆవేశంగా కాదు ఆలోచనతో చెయ్యటం అలవాటు చేసుకోవాలి వైదేహిగారూ"

"ఆ'గారు'తీసి అవతల పారేయమనిచెప్పాను మీరు వినటంలేదు"

"అలాగే" అంటూ వాకిలివైపు చూసి లేచినిల్చుని.

"సాధ్వీమణిగారా! రండిలోపలికి"అన్నాడు సాధ్వీమణి మెల్లగా లోపలికివచ్చింది. వైదేహి "నే వెళ్లి వస్తాను" అంటూ మూర్తి వుండమని చెప్తున్నా వినక తనగదిలోకి వచ్చేసింది. అవతలగదిలోనించి యేవేవో మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి. అవి వింటూ పోష్టుమేన్ విసిరిన కవరుతీసుకుని విప్పిచదువుకుంది.

ఈ నెల చాలా యిబ్బందిగా వుంది గనుక డబ్బు యెక్కువ పంపటానికి ప్రయత్నించమనీ, దుబారా ఖర్చులు చేసేప్పుడు యిక్కడి పరిస్థితులు గుర్తుచేసుకోమనీ, తండ్రి రాసిన పుత్తరం.పుత్తరంలో అంతకిమించి మరే సంగతులూ వుండవని వైదేహికి తెల్సు. పండగ యేదైనావస్తే శలవుపెట్టి రమ్మని రాయరు. 'పిలుంటేరా. కానీడబ్బు మాత్రం ముందే పంపు' అని రాసే తల్లిని నమిలిమింగేయాలన్నంత కోపం వస్తూ వుంటుంది వైదేహికి. అసలు జీతం అంతా తనేఖర్చు చేసుకుని

# వారఫలం

## 7-3-1975 శుక్రవారం మొదలు 13-3-1975 గురువారం వరకు

**మేషం :—** అన్ని వ్యవహారాల్లోను గౌరవంలభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

**వృషభం :—** రావలసినడబ్బు అందుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. మీ కంటే పెద్దవారుకూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. స్త్రీలకు —పుణ్యకార్యాలు చేస్తారు. సంతోషకరమైన సమాచారం అందగలదు.

**మిధునం :—** మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ప్రయాణాల్లో శ్రమ కలుగు తుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**కర్కాటకం:—** ఇతరులతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో చికాకులు యేర్పడతాయి. మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకించ గలరు. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు.

**సింహం :—** వృత్తిలో సాటివారి పోటీ పెరుగు తుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమకలుగు తుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం జరుగు తుంది.

**కన్య :—** మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో యెవరితోను వాదప్రతివాదాలు తగవు.

హాయిగా వుండిపోతే వాళ్లరోగం కుదురుతుంది అనే ఆలోచనా వస్తూ వుంటుంది అప్పుడప్పుడూ. కానీ తర్వాత స్థిమితంగా ఆలోచిస్తే గత్యంతరం లేకనే తల్లిదండ్రులు తనసంపాదన కోసం ఆశపడుతూవున్నారనేది గుర్తుకొస్తుంది. వూరికి వెళ్ళి వచ్చేస్తూ ఒకసారి యాభై రూపాయిలు తండ్రికిస్తూంటే అవి తీసుకోటానికి ఆయన పడిన బాధ ప్రత్యక్షంగా చూసింది. అందుకే వీలున్నంతవరకూ మనియార్డరు చేసేస్తూవుంటుంది. అలా పంపేప్పుడు బాధకాదు యెంతో తృప్తికల్గుతుంది వైదేహికి. ముసలి వాళ్లయిన తలిదండ్రుల అవసరాలకి ఆదుకుంటున్నాను కదా అని. పెళ్ళి చేసుకోకుండా కొన్నాళ్లు యిలావుండి కుటుంబానికి సాయపడితే అన్న ఆలోచనా వస్తూ వుంటుంది. ఆలభిప్రాయాలు ఒకదాన్ని మించి ఒకటి వైదేహిని వుక్కిరిబిక్కిరి చేసేస్తూ చికాకునికల్గిస్తాయి.

"అబ్బబ్బ! వెధవ మనస్సు యెందుకిచ్చావు భగవంతుడా" అని బాధపడి యే సినిమాకో వెళ్లి ఆ బాధని మర్చిపోవటానికి ప్రయత్నిస్తూ రోజులు నెట్టుకొస్తూన్న వైదేహికి మూర్తి స్నేహితం అపురూపంగా కన్పించింది. అందుకే దాన్ని యెంతో పదిలంగా చూసుకుంటూన్న సమయంలో సాధ్వీమణి మాటలు సూదుల్లా గుచ్చుకున్నాయి. ప్రతీకారం తీర్చుకోవాలన్నా మూర్తి అవకాశాన్ని యివ్వకుండా చేశాడు.

వైదేహి పడక కుర్చీలో పడుకుని కళ్లు మూసుకుంది. తలనొప్పి పగిలిపోతోంది. ఫ్లాస్కులో కాఫీ అయినా లేదు. డబ్బు యిచ్చినా తెచ్చిపెట్టే దిక్కు లేదు.

ఏం జీవితం నాది. ఈ ప్రపంచంలో నేనేనా. నాలాంటి ఆడపిల్లలు యింకా వున్నారా! వున్నారు... ఒకరుకాదు వందల్లో వేలల్లో వున్నారు. నీ కంటే కూడా బాధపడే ఆడపిల్లలు వున్నారు'' అంతరాత్మ గంటలా మ్రోగుతుంది. వైదేహి యింక తనని తను సంబాళించుకుంటుంది యెలాగో.

'' అమ్మగారూ కారియరు '' నౌకరు కుర్రాడు కారియరు పట్టుకువచ్చి పిల్చిన తర్వాతగానీ వైదేహి ఈ ప్రపంచంలోకి రాలేదు. లేచి తలుపు తెరిచి 'అరె టైమెంత' అనుకుంటూ వాచీ చూసుకుంది. ఏడున్నర దాటులోంది.

* * *

నాలుగురోజులు మామూలుగా గడిచిపోయాయి. వైదేహి ఆఫీసునించి వస్తూ మూర్తి గదివైపు చూసి ''అరె ఈ బ్రహ్మచారి మహాశయుడు యింకా యిల్లు చేరలేదా! అనుకుంది. కానీ రెండు రోజులైనా వేసిన తాళం అలాగేవుంది. సాధ్వీమణి మరెవరితోనో చెప్తూవుంటే వింది. నాలుగురోజులు శలవు పెట్టి వూరుకి వెళ్లాడనీ ఆదివారం గానీ రాడనీ. వైదేహికి మరో రెండు రోజులు గడపటమే కష్టమైపోయింది. మూర్తి రాలేదు. కానీ ఆఫీసు అడ్రెస్‌కి రిజిష్టర్ కవరు ఒకటి వచ్చింది. వణికే చేతులతో అది అందుకుని యెవరి దగ్గర నుంచి అని యిటూ అటూ తిప్పి చూసింది. ఫ్రం అడ్రెస్ మూర్తిది. సంతకం చేసి పోష్టుమేన్‌ని పంపి శలవు పెట్టి రిషెలో యెలా చేరిందో వైదేహికి తెలియదు. కాస్త పెద్దదిగావున్న ఆ కవరుని ఆఫీసులోనే విప్పటానికెందుకో భయమన్పించింది. ప్రక్క సీట్లలోవున్న సహవుద్యోగులు కుతూహలంగా చూస్తూన్నది గుర్తించేసరికి మరీ వణుకు వచ్చింది. అందుకే యింటికి వచ్చి కవరు విప్పింది. యేదో చిన్న పాకెట్టూ ఓ వుత్తరం వున్నాయి. ఆతురతగా ఆ వుత్తరం విప్పి గబగబా చదువుకుంటోంది వైదేహి.

వైదేహిగారు, నమస్కారం.

మీరు 'గారు' తీసెయ్యండి అన్నా నేను తియ్యనందుకు కోపగించుకోకండి. నేనిలా హఠాత్తుగా యిక్కడికి వచ్చి తిరిగి వెంటనే అక్కడికి రానిపరిస్థితు లొస్తాయని కలలో కూడా వూహించలేదు. కానీ పరిస్థితి అలా వచ్చేసింది. అసలు నాగురించి మీకు యేం తెలియదు. తెలిస్తే యేవేవో వూహలు అల్లుకోరు, నేను గ్రహించాను వైదేహీ. కానీ వైదేహీ నా జీవితం వడ్డించిన విస్తరి కాదు. సమస్యల మయం. నేనింతవరకూ అవివాహితుడిని అని అనుకుంటున్నారు మీరందరూ. కానీ నాకు పెళ్లిఅయి రెండు సంవత్సరాలైంది. మరెవరో పరాయిపిల్ల కాదు. అక్కకూతురునే పెళ్లిచేసుకోవాల్సిన పరిస్థితి వచ్చి హఠాత్తుగా ఆ పెళ్లి జరిగిపోయింది, నేనూ అక్కా యిద్దరమే సంతానం మా అమ్మకి. నాన్న చిన్నప్పుడే పోయారు. అక్క మైథిలి పుట్టగానే భర్త వియోగంతో పుట్టిల్లు చేరింది. మైథిలి మాయింట్లో పెరిగినపిల్ల. మామయ్యా అని పిలుస్తూన్న

(34 వ పేజీ చూడండి)

---

అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు — దైవకార్యాలు నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**తుల :—** అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగు తుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం ఆఖరులో సామాన్య వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

**వృశ్చికం :—** రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషి చేయవలసి వస్తుంది. స్త్రీలకు —ప్రయాణాలోచనలు చేస్తారు.

అనుకూల వార్తలను వింటారు.

**ధనుస్సు :—** మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో పోటీదారి పోటీతగ్గుతుంది. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

**మకరం :—** వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. పోటీదారిలో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. విలాస వస్తువులు కొంటారు.

**కుంభం :—** అనవసరమైన శ్రమ కలుగు తుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు —ఆరోగ్యం బాగుండదు. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

**మీనం :—** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారం ఆఖరులో మీ తాలూకు వస్తువులు పోవచ్చు. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి. స్త్రీలకు —కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

— మహేష్

ఆపిల్లకి నేను భర్తని అవుతాననికానీ అవాలని కానీ అనుకోలేదు. ఆపిల్ల నాకన్నా పద్నాలుగు సంవత్సరాలు చిన్నది. బలహీనంగా యెప్పుడూ ఏదో ఒక సుస్తీతో వళ్ళంతా కురుపులతో అనాకారిగా వుండే మైథిలి నాజీవిత సహచరి అయింది. దీనికి కారణం మాఅమ్మ. అక్క కన్నీళ్లకి కరిగిపోయి అవసానదశలో నాదగ్గర వాగ్దానం తీసుకుని మరీప్రాణాలు వదిలింది. వైదేహీ అంతవరకూ నా వుద్దేశాలు వూహలూ అలా అలా తేలిపోతూండేవి. జీవితం అందమైందిగా కన్పిస్తుండేది వుత్సాహంతో వురకలువేస్తూ చదువు పూర్తిచేసి వుద్యోగాన్ని సంపాదించి యింక నచ్చిన పిల్లకోసం అన్వేషిస్తున్న సమయంలో నావూహలకి సంబంధం లేకుండా ఈ పెళ్లి జరిగిపోయింది.

యిష్టంలేని పెళ్లి యెందుకు చేసుకున్నావ్ ? యెందుకు చేసుకోవాలి ? అని నన్నునేను ప్రశ్నించుకుని ఆలోచించీ ఆలోచించీ అలిసిపోయాను. మైథిలిని వదిలేసి మరోపెళ్లి చేసుకుంటే నన్నెవరూ యేం చెయ్యలేరు. కానీ అమ్మకిచ్చిన మాటవల్లనో అమాయకురాలైన మైథిలికి వేసిన మూడు ముళ్ల ప్రభావంవల్లనో నేను ప్రక్కదారుల్లో పడలేకపోయాను. కొన్నాళ్ల ఆవేశం అశాంతీ నన్ను వుక్కిరిబిక్కిరి చేసినా నిగ్రహించుకుని ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాను. వైదేహీ జీవితంలో ఒక్కోప్పుడు రాజీపడక తప్పదు. పడితీరాలి కూడా.

కాలేజీ రోజుల్లో ప్రేమలో పడ్డాను. కానీ ఆ అమ్మాయి నన్నుకాదన్నది. నేనక్కర లేదనుకున్న మైథిలి నాకాళ్లకి చుట్టుకుంది. ఈ బంధం వదిలేది కాదు. అందుకే మనస్సులో రాజీపడి ఇల్లూ యింటికి కావల్సిన హంగులూ ఒక్కోటే అమర్చుకుంటూ క్షణం విశ్రాంతి లేకుండా ఏదో ఒకపనిలో మనస్సుని 'లగ్నం' చేసుకుని ప్రశాంతంగా బ్రతకాలని ప్రయత్నిస్తున్నాను. ఈ సంఘర్షణలోనే చుట్టూ వుండే అందరికీ దూరంగా బ్రతకటం అలవాటుచేసుకున్నాను. దగ్గరైతే నా వివరాలు తెల్సుకుని పరిహసిస్తారేమో అని పిరికితనం. లేక సానుభూతి చూపినా సహించలేను.

ఈ మేడమీదకి అద్దెకి వచ్చిన తర్వాతే సాధ్వీమణితో పరిచయం. ఆవిడే కావాలని నా పరిచయం పెంచుకుంది. యెందుకో మాత్రం ఈ నాటికీ నాకు తెలియదు. ఆవిడ దగ్గర

## రాజీ

(11వ పేజీ తరువాయి)

నేను కొన్నిరకాల వంటలూ యెంబ్రాయిడరీ కుట్టుపనీ నేర్చుకున్నాను. సాధ్వీమణి చాలా ఉత్తమురాలు. నాకు ఆప్తురాలు. ఆవిడ ఆత్మీయతలో నాకు శాంతి దొరుకుతుంది వైదేహీ. ఆత్మీయతా ప్రేమా వున్నచోటే ఈర్ష్యకి చోటు వుంటుందేమో ! అందుకే నిన్ను అలా నొప్పించి వుంటుందనుకుంటాను. నీవూ నా ఆత్మీయురాలివి అయినావని గ్రహించి వుంటుంది.

ఆవిడదాంపత్యజీవితం బైటికి కన్పించేంత ఆదర్శంగా లేదు. అతను దురభ్యాసాలకి అలవాటుపడ్డాడని వాపోతోంది. ఈలాంటి విషయాల్లో మరొకరు యేం చెయ్యలేరు: యెవరి జీవితం వాళ్ళది. దాన్ని తీర్చిదిద్దుకోవల్సింది వాళ్లవాళ్ల చేతుల్లోనే వుంటుంది. పరిస్థితులని యెదిరించి అనుకూల వర్చుకోగల్గటం సామర్ధ్యం అవవచ్చు. కానీ పరిస్థితులు అనుకూలించనప్పుడు జీవితంలో రాజీపడటంకూడా విజ్ఞతే అనుకుంటాను.

మీ స్నేహితం నన్ను యెంతో ప్రభావితుడిని చేసింది కానీ ఒక స్త్రీకీ ఒక పురుషుడికీ 'స్నేహితం' యెన్నో రోజులు సాగటం కష్టం. యెందుకంటే చుట్టూవుండే సమాజం తప్పులు వెతుకుతూ అర్ధంలేని అభాండాలని వేస్తూ వుంటుంది. అని తెల్సినా మీకు దూరంగా వుండాలని ప్రయత్నించీ వుండలేకపోయాను. నాజీవితం యిదీ అని చెప్పాలని యెన్నోసార్లు ప్రయత్నించీ చెప్పలేకపోయాను. నాజీవితాన్ని గురించి యింకా చెప్తున్నాను వినండి.

పెళ్లిఅయిన తర్యాత వుద్యోగం వూరు వచ్చి మళ్లీ మా అక్కదగ్గరకి వెళ్లలేదు.

అక్క యెన్నో వుత్తరాలు రాసింది. మొదటిరాత్రి వేడుక చేసుకుని మైథిలిని కాపురానికి తీసుకు వెళ్లమని. కానీ నేను జవాబు రాయలేదు. తర్వాత నన్నునేను సంబాళించుకుని జీవితంతో రాజీకొచ్చి అక్కకి వుత్తరం రాశాను. మైథిలినియిక్కడికి పంపేసెయ్యమనీ నేను రాననీను. అక్క సంతోషంగా జవాబిచ్చింది మంచిరోజు చూసి తీసుకొస్తానని. నేనిలారాసి ఒకనెల అయింది. మైథిలి కొరకు యెదురు చూస్తున్నాను. ఈ చిన్న ఇల్లూ ఆ గృహిణి మీకూ సాధ్వీమణికీ విందు చేయాలని యెన్నెన్నో వూహల్లో తేలిపోతున్న నాకు అక్కదగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది మైథిలికి' జ్వరం అనీ'. వెంటనే బయలుదేరి ఈవూరు వచ్చేశాను. డాక్టరుకి చూపాను. మైథిలికి టీ బీ అనీ, గుర్తించటం ఆలస్యం చేశారనీ అయినా ఫర్లేదు మంచిమందులు వాడాలనీ పూర్తి విశ్రాంతి కావాలనీ శానిటోరియమ్‌లో చేర్పించమనీ సలహాయిచ్చాడు. అక్షరాలా ఆయన చెప్పినట్లు చేస్తున్నాను. రెండునెలలు శలవుపెట్టాను వైదేహీ. యిప్పట్లో నేనక్కడికి రాగలనన్న ఆశలేదు. ఇదీ నా జీవితం. వైదేహీ పెళ్లిలేకుండా వంటరిగా కాలం గడపటం కష్టం ఆడపిల్లకి నేను నీ ఆత్మీయుడిగా మంచి స్నేహితుడిగా యిచ్చే సలహా ఒక్కటే. నాఫ్రెండ్ ప్రభాకర్ నాగదికి వచ్చినప్పుడు చాలాసార్లు చూశారు కబుర్లు చెప్పారు గుర్తువుందిగా. అతను పట్టభద్రుడు కాకున్నా స్థిరమైన వుద్యోగం వుంది. మీరంటే ప్రేమవుంది. మీఅంగీకారం తెల్పితే పెళ్లికి రెడీగా వున్నాడు. కట్నం అవుసరంలేదు. మీ తల్లిదండ్రులతో సంప్రదించి ఈ పెళ్లికి నేనే పెద్దరికం వహిద్దాం అని యెన్నో కలలు కన్నాను కానీ అవకాశం లేదుకనుక మీకు రాస్తున్నాను. అతను ధనవంతుడు కాకున్నా గుణవంతుడు.

వైదేహి మీరు గెజెటెడ్ ఆఫీసర్ భర్తగా రావాలనీ మీ అందం చూసి వస్తాడనీ కలలు కంటూన్నారు. అవన్నీ జీవితంలో అందరికీ

### కలిమి లేములు

— అవనిగడ్డ సూర్యప్రకాష్.

గుడిసెలో  
మూల్గుతున్న లేమి  
మేడలో  
కులుకుతున్న కలిమిని  
చూసి — చూసి  
దానంత ఎదగాలని  
వెర్రిగా కలలు కంటుంది —  
కానీ —  
ఆ కలిమి  
ఉక్కు పాదాల క్రింద  
తర తరాలుగా  
తను నలిగిపోతున్నట్లు  
ఈ లేమి కేమి తెలుసు ... ?

అందిరావు వైదేహి. కాస్త ఆ కలలో నించి దిగివచ్చి ప్రపంచపు పోకడ గుర్తించి తల్లి దండ్రులని అర్థం చేసుకుని ఈ పెళ్లికి అంగీకరించటానికి ప్రయత్నించండి తప్పక వివాహం జరిగి తీరుతుంది. నేనూ రాగల్గితే తప్పక వస్తాను. ఏం! నా సలహా ఆలోచించి చూస్తారు కదూ!

వైదేహీ మనం ప్రేమించిన వాళ్ళ దగ్గర కావటం కంటే మనని ప్రేమించేవాళ్ళు దొరకటం ఒక విధంగా అదృష్టమేనేమో! మొదట అసహ్యించుకున్నా యిప్పుడు మన స్ఫూర్తిగా నా మైథిలిని తిరిగి పూర్తి ఆరోగ్యవంతురాలిని చెయ్యమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. యీసారికింక యింకేం రాయలేను. వైదేహీ నా అడ్రెస్ యిచ్చాను కదూ జవాబు రాస్తే సంతోషం.

యింతే

మూర్తి.

వైదేహి మళ్లీ మళ్లీ ఆ వుత్తరాన్ని యెన్నోసార్లు చదువుకుంది. మూర్తికి పెళ్లి అయిందా! అయింది అయింది. అన్నమాట ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. అందం, చదువూ, వుద్యోగం, సామర్థ్యం వున్న

## రాజీ

యువకుడు జీవితంలో 'రాజీ' పడుతున్నాడు. కేవలం తల్లికిచ్చిన మాటకోసం. అక్క కూతురు కోసం యెంత విచిత్రం! మూర్తి గారూ మీరెంత నిండు గుండె కలవారు! నిన్ను దక్కించుకున్న మైథిలి అదృష్టవంతురాలు నీవేకాదు నేనూ ఆ భగవంతుడిని వేడుకుంటాను మైథిలిని చల్లగా కాపాడమని.

కన్నీళ్లని పైట చెంగుతో తుడుచుకుంటూ వుండిపోయింది వైదేహి. రాత్రి పన్నెండింటి వరకూ ఆలోచించి ఆఖరుకి తండ్రికివుత్తరంరాసికవరు అంటించిమూర్తికీ వుత్తరంరాసి మళ్లీ మళ్లీ చదివి కవరు ప్రక్కన పెట్టి "మూర్తిగారు మీలా నేనూ జీవితంలో రాజీపడుతున్నాను" అనుకుంటూ కళ్లు మూసుకున్నది. ఆలోచనల్లో అలా యెప్పటికో నిద్రలోకి జారిపోయిన వైదేహికి యెవేవో కలలు. ఆ కలల్లో పెళ్లి పూల పల్లకీలో వూరేగింపు. సన్నాయి శ్రావ్యంగా వినిపిస్తోంది. వైదేహి చిరునవ్వు నవ్వుతోంది నిద్రలోనే హాయిగా.

( అయిపోయింది )

### చీకటి తప్పులు

చీకటి చాటున వేగపు హద్దును అతిక్రమించే కారు డ్రైవర్లు, భవిష్యత్తులో తమని తాము శిక్షించుకొను ప్రమాదంలో పడిపోతారు. రోదసీ పరిశోధనా కార్యక్రమాల్లో నియోగింపబడిన శాస్త్రవేత్తలు, వారి పరికరములలో ఒకటి చాలా ఉపయోగ పడగలదని సలహా యిచ్చారు. అట్టి పరికరము ప్రత్యేకమైన ఫ్లాష్ గన్ తో కలిపి ఉపయోగింపబడినప్పుడు రాత్రులందు ఫొటోలు తీయగల కెమెరా దానిలో ఇన్‌ఫ్రా రెడ్‌ఫిల్మ్ ఉపయోగించబడుతుంది. ఈ ఫిల్మ్ ఉష్ణము వల్ల పృథఃకరింప బడుతుంది. వేగంగా కారును నడుపుచున్న డ్రైవరు ముఖమును అతని చర్మము నుండి వచ్చు వేడిమివల్ల ఫొటో తీస్తుంది. దానిలో అతను ఉపయోగించిన కారు నెంబరు కూడా పడుతుంది. పోలీసులు ఆ ఫొటోను అతని నేరమును నిరూపించుటకు ఉపయోగింతురు.

జీవితంలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే అనేక మధుర క్షణాలుంటాయి



తలనొప్పి మూలంగా
మీ ఆనందాన్ని
పాడుచేసుకోవద్దు

2 ఆస్ప్రో
తీసుకోండి

మైక్రోఫైన్డ్ ఆస్ప్రో నొప్పిని
అతిశీఘ్రంగా తొలగించును

ASPRO
Nicholas

A.G.62.76